సాక్షి అనకాపల్లి
బుధవారం ¦ 18 ¦ జూన్ ¦ 2025



అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

ఉష్ణోగ్రతలు

మంగళవారం

గరిష్ఠం/కనిష్ఠం

అనకాపల్లి : 33.3/26.0

రాగల ఐదు రోజులు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు.



అపారిశుధ్యం

జిల్లాలో ఏ వీధి చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. 9లో

న్యూస్‌రీల్

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలు

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ బదిలీల్లో భాగంగా ఆంధ్రా మెడికల్ కాలేజీ, కేజీహెచ్‌లో మొత్తం 43 మందిని బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, డీసీఎస్ఆర్ఎంఓ డాక్టర్ మెహర్‌కుమార్‌లు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ లోకనాథం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి బదిలీ అయ్యారు. 12 మంది ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 28 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కూడా స్థాన చలనం కలిగింది.

వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో 330 మందిని బదిలీ చేశారు. ఈ మేరకు ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధాకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 250 మంది స్టాఫ్ నర్సులు, 80 మంది హెడ్ నర్సులు బదిలీ అయ్యారు. వైద్య ఆరోగ్యశాఖలో ఐదు కేడర్లలో 60 మంది స్థాన చలనం పొందారు.

25న పెన్షన్ అదాలత్

మహారాణిపేట: ఈనెల 25న పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు తపాల శాఖ సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. తపాలశాఖలో పనిచేసి రిటైరైన వారు సమస్యలుంటే ఈనెల 23వ తేదీలోగా వినతి పత్రాలు సీనియర్ సూపరింటెండెంట్, తపాల శాఖ, విశాఖపట్నం-01కు పంపాలని కోరారు.

డీఎస్సీ పరీక్షకు 2,305 మంది హాజరు

ఆరిలోవ: జిల్లాలో మంగళవారం 12 కేంద్రాల్లో జరిగిన డీఎస్సీ పరీక్షలకు 2,305 మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 1,186 మందికి గాను 1,157 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 1,185 మందికి గాను 1,148 మంది అభ్యర్థులు పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు. మొత్తంగా 66 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఏఎంసీకి లక్ష్మీకాంతమ్మ పార్థివదేహం



ఏఎంసీ లక్ష్మీకాంతమ్మ పార్థివ దేహాన్ని అప్పగిస్తున్న బంధువులు

మహారాణిపేట: సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక ట్రస్టీ, అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపక సభ్యురాలు పేరిచర్ల లక్ష్మీకాంతమ్మ పార్థివదేహాన్ని మంగళవారం ఆంధ్రా మెడికల్ కాలేజీకి దానం చేశారు. దేహదాన మహోద్యమానికి పునాది వేస్తూ, మొత్తం శరీరాన్ని దానం చేసిన తొలి 35 మందిలో పేరిచర్ల లక్ష్మీకాంతమ్మ ఒకరు. ఈమె ట్రస్ట్ వ్యవస్థాపక కోశాధికారి శ్రీహరి రాజు మాతృమూర్తి, ప్రముఖ సంఘ సంస్కర్త, దివంగత పేరిచర్ల సుబ్బరాజు జీవిత భాగస్వామి. లక్ష్మీకాంతమ్మ తెలుగు పండిట్‌గా పనిచేశారు. ఈ నెల 16న విజయవాడలో పరీక్షలు చేయిస్తుండగా, ఆకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో కన్నుమూశారు. మంగళవారం లక్ష్మీకాంతమ్మ కళ్లను ఎల్.వి.ప్రసాద్ ఐ ఆసుపత్రికి దానం చేయగా, మధ్యాహ్నం 12 గంటలకు ఆమె పార్థివదేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీకి అప్పగించారు. కార్యక్రమంలో ఆమె కుమారులు, బంధుమిత్రులు, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి, సభ్యులు జి.కన్యాకుమారి పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి మారువారం



ఊరేగింపుగా సముద్రం వద్దకు వెళుతున్న మత్స్యకార మహిళలు

మహారాణిపేట (విశాఖ): మత్స్య సంపద సమృద్ధిగా లభించాలని, వేటకు వెళ్లిన మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని కోరుతూ మత్స్యకార మహిళలు మంగళవారం భక్తి శ్రద్ధలతో గంగమ్మ తల్లి మారువారం నిర్వహించారు. ఫిషింగ్ హార్బర్‌లోని గంగమ్మ తల్లి ఆలయం వద్ద కనులపండువగా ఈ కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు కలశాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'గంగమ్మ తల్లి.. కాపాడమ్మా'అంటూ వేడుకున్నారు. మత్స్యకార సంప్రదాయం ప్రకారం పూజలు చేసి, పసుపు, కుంకుమలను సముద్రంలో నిమజ్జనం చేశారు. గత మంగళవారం గంగమ్మ పండగ నిర్వహించిన అనంతరం ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి మత్స్యకారులు వేట ప్రారంభించారు. మారువారం సందర్భంగా సముద్ర దేవతను పసుపు, కుంకుమలతో డ్రై ఫిష్ మహిళా సంఘం సభ్యులు పూజించారు.

తీరంలో చేపలు మృత్యువాత

- పూడిమడక ఉప్పుటేరులో గుట్టలుగా తేలిన వైనం
- వ్యర్థ రసాయనాల వల్లే మృతి
- నేరుగా సముద్రంలోకి వదిలేస్తున్న ఫార్మా కంపెనీలు
- వేలాది మంది మత్స్యకారుల జీవనోపాధిపై దెబ్బ
- ఫార్మా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



పూడిమడక ఉప్పుటేరు వద్ద మృత్యువాత పడ్డ చేపలు

సాక్షి, అనకాపల్లి: పారిశ్రామిక ప్రాంతం అచ్యుతాపురం సెజ్ తీరంలో జలచరాలను కాలుష్యం కబళిస్తోంది. ఇక్కడ పూడిమడక ఉప్పుటేరు(మొగ) వద్ద సెజ్‌లో 200కుపైగా ఫార్మా కంపెనీల నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలు నేరుగా సముద్రంలోకి కలవడంతో లక్షలాది చేపలు మృత్యువాత పడుతున్నాయి. పర్యావరణాన్ని కాపాడుతున్న అరుదైన ఆలివ్‌రిడ్లే తాబేళ్లు నశించిపోతున్నాయి. మంగళవారం ఉదయం ఫార్మా కంపెనీల నుంచి సముద్రంలోకి విడిచిపెట్టిన కలుషితమైన వ్యర్థ రసాయనాల వల్ల లక్షలాది చేపలు మృతి చెంది కుప్పలు తెప్పలుగా తీరంలో తేలాడాయి. ఇది ఈ రోజే కొత్తగా జరగలేదు. ఇలా తరుచూ జరుగుతూనే ఉంటోందని స్థానిక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా, పరిశ్రమ యాజమాన్యాలు పట్టించుకోవడంలేదు. ప్రభుత్వ అధికారుల్లో చలనం లేదు. పర్యవసానంగా 12,844 మత్స్యకార కుటుంబాల జీవనోపాధిపై దెబ్బపడుతోంది.

శుద్ధి చేయకుండా సముద్రంలోకి వ్యర్థాలు..

అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలు రసాయన వ్యర్థాలను శుద్ధి చేయకుండా నేరుగా ఉప్పుటేరులోకి విడుదల చేస్తున్నాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఫార్మా కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలను ద్రవ రసాయన వ్యర్థాలను ఈటీపీ పద్ధతిలో, ఘన వ్యర్థాలను రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా శుద్ధి చేస్తారు. ఇది ఒక వంతు అయితే .. ఫార్మా కంపెనీలో ప్రమాదకరమైన వ్యర్థాలను వాటి స్వభావం ఆధారంగా విభజించి శుద్ధి చేయాల్సి ఉంటుంది. వీటిపై కంపెనీ యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. సురక్షితంగా శుద్ధి చేసి అప్పుడు సముద్రంలోకి వదిలివేయాలి. ఈ విధంగా చేయకపోవడం వల్ల మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు, కలెక్టర్‌కు మత్స్యకారులు ఫిర్యాదులు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



మృతి చెందిన చేపలను పరిశీలిస్తున్న అధికారులు

కనుమరుగవుతున్న ఆలివ్ రిడ్లే తాబేళ్లు..

దేశంలోనే అరుదైన ఆలివ్‌రిడ్లే తాబేళ్లు తూర్పు తీరంలో విశాఖ-అచ్యుతాపురం తీరానికి వస్తుంటాయి. పర్యావరణాన్ని పరిక్షించే ఇవి ఒడిశా నుంచి వేలాది కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడ గుడ్లు పెట్టడానికి వస్తుంటాయి. ఏటా డిసెంబర్ నుంచి ఏప్రిల్‌లో తీరంలో గుడ్లు పెడుతుంటాయి. గతంలో మార్చిలో పూడిమడక తీర ప్రాంతానికి గుడ్లు పెట్టడానికి వచ్చిన ఆలివ్ రిడ్లే తాబేళ్ల వందలాది కలుషిత వ్యర్థ రసాయనాలకు గురై మృత్యువాత పడ్డాయి.

> అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందనే లేదు..
>
> ఫార్మా కంపెనీల యాజమాన్యాల నిర్లక్ష్యంగా కారణంగా మత్స్యకారులకు జీవనోపాధి కోల్పోతున్నారు. తరుచూ పరిశ్రమల నుంచి కలుషిత, హానికరమైన వ్యర్థ రసాయనాలను నేరుగా సముద్రంలోకి వదలడంతో లక్షలాది చేపలు, చేప పిల్లలు చనిపోతున్నాయి. గతంలో చాలాసార్లు కలెక్టర్‌కు, మత్స్యకార అధికారులకు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశాం. ఏదో జరిగినప్పుడు తూతూ మంత్రంగా వచ్చి చూసి వెళ్లిపోతున్నారు. ఆ తర్వాత దాని గురించి పూర్తిగా విస్మరిస్తున్నారు. యాజమాన్యాల శ్రేయస్సు కోసం ఆలోచన చేస్తున్నారే తప్ప.. వేటకు వెళ్లి జీవించే మత్స్యకారుల గురించి ప్రభుత్వం ఆలోచన చేయడం లేదు. న్యాయం చేయకపోతే పోరాడక తప్పదు.
>
> – ఉమ్మిడి జగన్, మత్స్యకార నాయకుడు, పూడిమడక గ్రామం

తల్లికి వందనం.. తండ్రులకు పాట్లు



అర్జీలను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఏఈ జగదీష్

మునగపాక: కూటమి ప్రభుత్వం 'అమ్మ ఒడి' పథకం స్థానంలో ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' అర్హులందరికీ అందడం లేదు. ఏదో ఒక వంక పెట్టి పథకాన్ని నిలిపివేశారు. అందులో ప్రధానమైనది కరెంటు బిల్లు. 300 యూనిట్లు దాటి వాడితే అనర్హులని నిబంధన పెట్టారు. ఈ నిబంధన అమలు మాత్రం చాలా దారుణంగా ఉందన్న ఆవేదన ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. నెలకు 100, 150 యూనిట్లు వాడే వారిపై సైతం అనర్హత వేటు వేశారని ఆగ్రహం చెందుతున్నారు. తమ విద్యుత్ బిల్లులను పట్టుకొని తండ్రులు విద్యుత్ శాఖ కార్యాలయాలకు వస్తున్నారు. 300 యూనిట్లు ఎప్పుడు వాడామో చెప్పండని అధికారులను నిలదీస్తున్నారు. మునగపాకలోని విద్యుత్ శాఖ కార్యాలయానికి బాధితుల తాకిడి ఎక్కువగా ఉంది. కరెంటు ఎంత వాడామో సరైన నివేదిక ఇచ్చి 'తల్లికి వందనం' లబ్ధి వచ్చేలా చూడాలని ఏఈ జగదీష్‌కు వినతి పత్రాలు అందజేస్తున్నారు. ఈ విషయమై ఏఈ వివరణ ఇస్తూ.. ఎన్ని యూనిట్లు దాటితే పథకం వర్తించదో తమకు తెలీదని, ఈ విషయంలో ఎలాంటి సమాచారం లేదన్నారు. ఏడాది మొత్తంలో విద్యుత్ వినియోగాన్ని సరాసరి చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. తమకు పూర్తి స్థాయిలో గైడ్‌లైన్స్ రాలేదన్నారు.

తమ్ముడి చేతిలో అన్న హతం

- మద్యం మత్తులో వివాదం
- నాటుతుపాకీతో కాల్పులు



మృతుడు రాము

చీడికాడ: మద్యం మత్తులో చిన్న విషయం కాస్తా పెద్దపై సొంత అన్నయ్య ప్రాణం తీసే వరకు వెళ్లింది. ఈ దుర్ఘటన మండలంలోని తురువోలులో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన జోగా రాము (48), జోగా దేముళ్లు సొంత అన్నదమ్ములు. మంగళవారం సాయంత్రం గ్రామంలో ఒడ్డు పండగ చేసుకొని కళ్లానికి వెళ్లారు. తల్లి వద్ద పాలు తాగేస్తుందని మద్యం మత్తులో ఉన్న దేముళ్లు దూడపెయ్యిని కర్రతో కొట్టాడు. దీనిని మృతుడు రాము వారించాడు. దీంతో ఇరువురి మధ్య స్వల్ప తగాదా జరిగింది. తీవ్రమైన కోపంతో దేముళ్లు పాకలో ఉన్న నాటు తుపాకీ తెచ్చి అన్నపై కాల్పులు జరపగా రాము ఛాతి కింద గాయమైంది. కుటుంబ సభ్యులు ఆటోలో చోడవరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో రాము మృతి చెందాడు. ఈ సమాచారం పోలీసుల వరకు చేరడంతో కె.కోటపాడు సీఐ పైడిపునాయుడు, మాడుగుల ఎస్‌ఐ నారాయణరావులు మంగళవారం రాత్రి గ్రామానికి వెళ్లి విచారించారు. అయితే రాము మృతికి కాల్పులు కారణం కాదని కుటుంబ సభ్యులు చెబుతూ ఎటువంటి ఫిర్యాదు ఇవ్వలేదని ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు చెప్పారు.

పాలిటెక్నిక్ ప్రిన్సిపాళ్ల బదిలీ

మురళీనగర్: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు బదిలీలు నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ జీవీ రామచంద్రరావు గన్నవరం పాలిటెక్నిక్ కాలేజీకి బదిలీపై వెళ్లగా, ఆ స్థానంలో సింహాద్రిపురం పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కె.తాతాజీని బదిలీ చేశారు. ప్రస్తుతం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అతని ఒరిజినల్ స్థానం ఆముదాలవలస నుంచి శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి రానున్నారు. పాడేరు జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కె.సుజాత కాకినాడ ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కాలేజీకి బదిలీ అయ్యారు. ఈమేరకు ఉత్తర్వులు అందాయి.

మొబైల్ పోయిందా.. ఈ నంబర్‌కు మెసేజ్ చేయొద్దు

అనకాపల్లి టౌన్: మీ ఫోన్ పోయిందా.. అయితే ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయండి. మీ ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను మెసేజ్ చేయండి చాలు.. అంటూ జిల్లా పోలీసులు ఊదరగొట్టారు. వివరాలు 95052 00100 నంబర్‌కు పంపిస్తే మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి కనిపెడతామన్నారు. చాలా కనిపెట్టారు కూడా.. అయితే మంగళవారం ఫోన్ పోగొట్టుకున్న ఒకరు ఈ నంబర్‌కు మెసేజి పంపి కంగుతిన్నారు. వివరాలు పంపాక ఎలాంటి సమాధానం రాకపోవడంతో ఆ నంబర్‌కు కాల్ చేయగా.. రాంగ్ నంబర్ అని పెట్టేశారు. మళ్లీ చేసి 'ఇది పోలీస్ ఐటీ కోర్ విభాగం నంబరేనా' అని అడిగితే చిరాకు పడ్డారు. ఈ విషయం 'సాక్షి' దృష్టికి రావడంతో కారణమేమిటని ఆరా తీసింది. నంబర్ మారిందని, ఇకపై 93469 12007 నంబర్‌కు మెసేజి చేయాలని జిల్లా పోలీస్ ఐటీ కోర్ విభాగం పోలీసులు తెలిపారు. ఈ నంబర్‌ను ఎక్కువగా ప్రచారం చేయకపోవడంతో పాత నంబర్‌నే చాలామంది వినియోగిస్తున్నారు. కొత్త నంబర్‌కు ఏదైనా మొబైల్ ఫోన్ నుంచి 'హాయ్' అని మెసేజ్ చేస్తే పోలీస్ ఐటీ కోర్ టీం స్పందిస్తుంది. వివరాలు తీసుకొని సరికొత్త టెక్నాలజీతో ఫోన్ ఎక్కడుందో కనిపెడుతుంది.



బీచ్‌రోడ్డు దిగ్బంధం



వాహనాల రాకపోకల నిలిపివేత ■ పోలీసుల వలయంలో సాగరతీరం ■ శరవేగంగా యోగా దినోత్సవ ఏర్పాట్లు



ఏర్పాట్లలో నిమగ్నమైన పోలీసులు

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్ల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి బీచ్‌రోడ్డులో వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. యోగా కార్యక్రమానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తుండటంతో పనులకు ఆటంకం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆర్.కె.బీచ్ నుంచి వాల్తేర్ డిపో కూడలి వరకు రహదారిని మూసివేయడంతో.. ఆటువైపుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఇక యోగా దినోత్సవం కోసం బీచ్ రోడ్డులో పనులు ఊపందుకున్నాయి. రహదారికి ఇరువైపులా ప్రత్యేక కంపార్ట్‌మెంట్ల నిర్మాణం, వాటిలో గ్రీన్ మ్యాట్‌లు పరచడం వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీక్షకుల సౌకర్యార్థం ఎల్ఈడీ తెరలను, వాటికి అవసరమైన ఇంటర్నెట్, విద్యుత్ కనెక్షన్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఆర్.కె.బీచ్ వద్ద ప్రధాన వేదికతో పాటు, ఇసుక తిన్నెలపై మరో భారీ వేదికను నిర్మిస్తున్నారు. భారీగా హాజరయ్యే ప్రజల కోసం మొబైల్ టాయిలెట్లను కూడా అందుబాటులోకి తెచ్చారు. మరోవైపు ఫుట్‌పాత్‌లకు, డివైడర్లకు రంగులు వేస్తూ తీరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. యోగాంధ్ర ప్రచారంలో భాగంగా నగరంలో హోర్డింగులు, బ్యానర్లు వెలిశాయి. ఈ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నగర పోలీసులతో పాటు ఇతర జిల్లాల నుంచి అదనపు బలగాలు విశాఖకు చేరుకున్నాయి. కేంద్ర భద్రతా దళం(ఎస్‌పీజీ) అధికారులు సైతం ఏర్పాట్లను నిశితంగా పరిశీలిస్తూ, భద్రతాపరమైన సూచనలు అందిస్తున్నారు. తీరం వెంబడి పూర్తిస్థాయిలో పోలీసులను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు.



మొబైల్ మరుగుదొడ్లను సిద్ధం చేస్తున్న కార్మికులు

యోగాంధ్రకు నిధుల కటకట

- గంటల వ్యవధిలోనే ఆవిరైన రూ.20 కోట్లు
- నిర్వహణకు మొత్తం రూ.75 కోట్లు అవసరం
- ఇప్పటికి వరకు సగం కూడా విడుదల చేయని ప్రభుత్వం
- మూడు రోజుల ముందు నిధుల కోసం అగచాట్లు
- 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం



ఫుట్‌పాత్‌లకు మెరుగులు దిద్దుతున్న కార్మికులు

మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కేవలం మూడు రోజులే మిగిలి ఉన్న వేళ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర-2025'కార్యక్రమానికి నిధుల లేమి వెంటాడుతోంది. కార్యక్రమ నిర్వహణకు మొత్తం రూ.75 కోట్లు అవసరమని జిల్లా యంత్రాంగం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపగా.. ఇప్పటివరకు కేవలం రూ.20 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. అదీ మంగళవారం విడుదలైన ఈ అరకొర నిధులు.. కేవలం గంటల వ్యవధిలోనే బిల్లుల చెల్లింపులకు ఆవిరైపోవడంతో ఖజానా మళ్లీ ఖాళీ అయింది. దీంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కార్యక్రమ నిర్వహణకు మొత్తం రూ.75 కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే మంగళవారం కేవలం రూ.20 కోట్లు మాత్రమే విడుదల చేసింది ప్రభుత్వం. రూ.20 కోట్లు జిల్లా యంత్రాంగం ఖాతాలో పడిన నాలుగు గంటల్లోనే చెల్లింపులు జరిగాయి. అయితే, పేరుకుపోయిన బిల్లులతో పోలిస్తే ఇది నామమాత్రమే. చెల్లించాల్సిన ప్రతీ వంద రూపాయలకు కేవలం పది రూపాయలు అడ్వాన్స్‌గా చెల్లించి చేతులు దులుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. స్టేజీల నిర్మాణం, బారికేడ్లు, స్నాక్స్ ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్ల వంటి అత్యవసర పనులకు సంబంధించిన కాంట్రాక్టర్లకు ఈ పాక్షిక చెల్లింపులు జరిపారు. మిగిలిన మొత్తం కోసం వారి నుంచి తీవ్ర ఒత్తిడి వస్తుండటంతో, తక్షణమే మిగతా నిధులు విడుదల చేయాలని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి మరోసారి లేఖ రాసింది.

భారీ ఏర్పాట్లు.. అరకొర నిధులు

ఒకవైపు నిధులు లేక ఇబ్బందులు పడుతున్నా, మరోవైపు కార్యక్రమ ఏర్పాట్లు మాత్రం సాగుతున్నాయి. సుమారు 5 లక్షల మంది పాల్గొంటారని అంచనా వేసి, 326 ప్రత్యేక కంపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 2 లక్షల మ్యాట్లు, టీ-షర్టులు అందించగా, మరో 3 లక్షల మందికి అవసరమైన వాటిని రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చాల్సి ఉంది. దీనికి తోడు పాల్గొనే 5 లక్షల మందికి ఒక్కొక్కరికి రూ.100 విలువైన స్నాక్స్ ప్యాకెట్ అందించాలన్నా రూ.5 కోట్ల ఖర్చు తప్పదు. ఈ ఖర్చులన్నీ కాకుండా వీఐపీ, వీవీఐపీల బస, రవాణా వంటి అదనపు వ్యయాలు ఉన్నాయి. ఇప్పటికే జీవీఎంసీ, వీఎంఆర్డీఏ వంటి సంస్థలు తమ నిధులతో సుందరీకరణ, నిర్మాణ పనులు చేపడుతూ అదనపు భారం మోస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం అంచనా వ్యయంలో కనీసం సగం కూడా విడుదల చేయకపోవడంతో, ఇంత ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలో తెలియక అధికారులు ఆపసోపాలు పడుతున్నారు.

హోటళ్లు, రిసార్ట్‌లు హౌస్‌ఫుల్

- 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం
- అతిథుల కోసం భారీ ఏర్పాట్లు
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రుల హాజరు

మహారాణిపేట: నగరానికి వీవీఐపీలు, వీఐపీల తాకిడి పెరిగింది. మూడు రోజుల్లో విశాఖ కేంద్రంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించనున్నారు. దీంతో ఈ నెల 20, 21 తేదీల్లో విశాఖ వచ్చే అతిథుల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వీరికి రెండు రోజులకు అవసరమైన వసతి, రవాణా, ఇతర ఏర్పాట్లలో అధికార యంత్రాంగం బిజీగా ఉంది. కార్యక్రమంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, 22 మంది ఐఏఎస్‌లు, 70 మంది ఐపీఎస్ అధికారులు, కేంద్ర, రాష్ట్ర ఆయుష్ విభాగానికి చెందిన 40 మంది అధికారులతోపాటు, రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, సీనియర్ నాయకులు, టీడీపీ, జనసేన నేతలు భారీగా తరలివస్తున్నారు. వీరి కోసం నగరంలో హోటల్స్, రిసార్ట్స్ సిద్ధం చేశారు. దీంతో నగరంలో చిన్న, పెద్ద అన్ని హోటళ్ల హౌస్‌ఫుల్ బోర్డులు పెట్టేశాయి.

అన్నీ రిజర్వ్‌డ్ : నగరంలో హోటల్స్, రిసార్టుల్లో రూమ్‌లు అన్నీ రిజర్వ్ చేశారు. మొత్తం 15 హోటళ్లలో 520 గదులు, 18 సూట్స్, 53 ప్రీమియర్, 147 సుపీరియర్/లగ్జరీ సూట్స్ సిద్ధం చేశారు. నగరానికి చేరుకున్న వారికి వారి హోదాను బట్టి సూట్స్, రూమ్స్ కేటాయిస్తున్నారు. ప్రధాని మోదీకి నేవీలో బస ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు నోవోటెల్, డీసీఎం పవన్ పోర్ట్ గెస్ట్‌హౌస్‌లో ఉంటారు.

అనకాపల్లిలో మంత్రుల సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్, వేదికపై మంత్రులు కొల్లు రవీంద్ర, అనిత

అనకాపల్లి: విశాఖ నగరంలో ఈ నెల 21న ఉదయం 7 గంటలకు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆ రోజు వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ విచ్చేస్తారన్నారు. జిల్లా నుంచి అన్ని వర్గాల ప్రజలు యోగాలో పాల్గొనే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

అసంపూర్తిగా అగ్రి ల్యాబ్

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దాదాపు 90 శాతం పూర్తయిన జిల్లా అగ్రిల్యాబ్ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం రూ.40 లక్షల నిధుల విడుదలకు చొరవ చూపకపోవడంతో రూ.6 కోట్ల ప్రాజెక్టు ప్రారంభానికి నోచుకోని పరిస్థితి నెలకొంది. ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తే సబ్బవరం చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు, అనకాపల్లి జిల్లాలోని రైతన్నలకు ఎంతో మేలు జరిగేది.

- అందుబాటులోకి రాని జిల్లా స్థాయి అగ్రిల్యాబ్
- రూ.6 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మాణం
- గత ప్రభుత్వంలో 90 శాతంపైగా పనుల పూర్తి
- కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిచిన పనులు

జిల్లా స్థాయి అగ్రిల్యాబ్ కోసం సబ్బవరంలోని సర్వే నెం.271లో 5 ఎకరాలు కేటాయించారు. సుమారు రూ.6 కోట్ల నాబార్డ్ నిధులతో చేపట్టే ఈ ల్యాబ్ కోసం రూ.3.5 కోట్లతో 14 గదులతో కూడిన భవన నిర్మాణాలను పోలీస్ హౌసింగ్ బోర్డు చేపట్టింది. మిగిలిన రూ.2.5 కోట్లతో అవసరమైన పరికరాలు, ఇతర మౌలికవసతుల ఏర్పాటుకు నిర్ణయించారు. ల్యాబ్‌కు కేటాయించిన స్థలంలో కొంతమంది ఆక్రమణదారులు ఉండటంతో కాంట్రాక్టర్‌కు స్థలం అప్పగించడంలో జాప్యం జరిగింది. దీని వల్లే గత ప్రభుత్వంలో సకాలంలో ల్యాబ్ అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. నిర్మాణాల పూర్తికి మరో రూ.40 లక్షలు కావాల్సిన సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తికావస్తున్నా ఎలాంటి పురోగతి కనిపించడం లేదు.

5 ఎకరాల్లో.. రూ.6 కోట్లతో..



దోర్లు ఏర్పాటు చేసి తుది మెరుగులకు నోచుకోని వైనం

సబ్బవరం: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన సేవలన్నీ అందుబాటులోకి తెచ్చింది. పెట్టుబడి సాయం, రాయితీ ఎరువులు, విత్తనాలు, మద్దతు ధర తదితర అన్ని విధాలా రైతుకు అండగా నిలిచింది. అందులో భాగంగానే రైతన్నలు పంట సాగుకు ముందు భూసార పరీక్షలు, విత్తన, ఎరువులు, పురుగు మందుల నాణ్యత పరీక్షలు తదితరాల కోసం సబ్బవరంలో జిల్లా అగ్రి ల్యాబ్ ఏర్పాటుకు సంకల్పించింది. 90 శాతం పనులు పూర్తయిన దశలో ప్రభుత్వం మారడంతో అగ్రిల్యాబ్ సేవలు అందుబాటులోకి రాకుండానే అర్ధంతరంగా నిలిచాయి.

అందుబాటులోకి వస్తే ఎంతో మేలు

ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తే విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, మట్టి నమూనాలను పరీక్షించి, నివేదికలు త్వరితగతిన అందుకునే వీలుండేది. జిల్లా స్థాయి ల్యాబ్‌లో 12 మంది ఏవోలు, 24 మంది ఏఈవోలకు ఉద్యోగావకాశాలు దక్కేవి. వీరి సాయంతో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల నాణ్యతతోపాటు, మట్టి నమూనాలను ఉచితంగానే పరీక్షించి, ఏ భూమి ఏ పంటకు అనుకూలం, విత్తనాలు చల్లక ముందే వాటి నాణ్యత తెలుసుకోవడం ద్వారా నష్ట భయం నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ సేవలన్నీ ఉచితం కావడంతో ప్రతి రైతు పంటకు ముందే జాగ్రత్త పడేందుకు వీలుండేది. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల బారిన పడే అగత్యం తప్పుతుంది. ల్యాబ్ అందుబాటులోకి రాకపోవడంతో అంచనా సేద్యంతో రైతులు ఎంతో కొంత నష్టపోతున్నారు.



నిర్మాణం పూర్తయిన జిల్లా అగ్రిల్యాబ్

రైతుల కష్టాలు తీర్చేందుకు..

పంటలో సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులతో పాటు భూసార పరీక్షలకు అవసరమైన ల్యాబ్ వసతి గతంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని జేడీ కార్యాలయంలో ఉండేది. భూసార పరీక్షలు నిర్వహించి రైతులు తమ భూములు ఏ పంటలకు అనుకూలంగా ఉన్నాయో తెలుసుకోవాలంటే విశాఖతోపాటు, నర్సీపట్నంలోని భూసార పరీక్ష కేంద్రాన్ని ఆశ్రయించాల్సి వచ్చేది. సిబ్బంది కొరత, దూరాభారం కారణంగా చాలా మంది రైతులు ఆ దిశగా ప్రయత్నించేవారు కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ సేవల్ని చేరువ చేసేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక సమీకృత వ్యవసాయ ప్రయోగశాల ఏర్పాటు దిశగా ప్రతిపాదించారు. జిల్లా మొత్తానికి సబ్బవరంలో ల్యాబ్‌కు శ్రీకారం చుట్టారు.



తుప్పలు, డొంకలతో అధ్వానంగా మారిన అగ్రిల్యాబ్ ఆవరణ

అందుబాటులోకి వస్తే మేలు



వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలైన బొప్పాయి, కాలీఫ్లవర్, టమాటా, ఉల్లి, అరటి వంటివి సుమారు 7 ఎకరాల్లో సాగుచేస్తున్నా. ఇందులో కొంత సొంతం. మిగిలినది కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నా. భూసార పరీక్షలు, కల్తీలేని ఎరువులు, విత్తనాల నిర్ధారణకు ఎవరెవరినో ఆశ్రయించాల్సి వస్తోంది. సబ్బవరం అగ్రిల్యాబ్ అందుబాటులోకి వస్తే మాలాంటి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. – చీపురుపల్లి బంగార్రాజు, అమృతపురం గ్రామం

నిధులిస్తే అందుబాటులోకి..



జిల్లా స్థాయి అగ్రి ల్యాబ్ నిర్మాణ పనులు 90 శాతం వరకూ పూర్తయ్యాయి. మరో రూ.40 లక్షల నిధులు కావాల్సి ఉంది. ఆ నిధులు విడుదల కాకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. భవన నిర్మాణం తుది దశకు రావడంతో మౌలిక వసతుల కల్పన, ల్యాబ్‌కు అవసరమైన పరికరాల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే అందుబాటులోకి తీసుకొస్తాం. – బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి, అనకాపల్లి

క్లుప్తంగా

6 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

మాడుగుల: మండలంలో గరికి బంద గ్రామ సమీపంలో మంగళవారం మాడుగుల పోలీసులు 6 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నారాయణరావు కథనం ప్రకారం .. ముందస్తు సమాచారం ప్రకారం గరికి బంద వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. పాడేరు నుంచి వస్తున్న స్కార్పియోను ఆపి తనిఖీ చేశారు. నలుగురు నిందితులతో పాటు 6 కిలోల గంజాయిని పట్టుకున్నారు. వాహనంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకుని, నంద్యాల జిల్లా బేతంచర్ల ప్రాంతానికి చెందిన నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన కృష్ణ

నర్సీపట్నం: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన మంగళవారం మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల రోడ్డులో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మాకవరపాలెంకు చెందిన సిహెచ్.కృష్ణ తీవ్రంగా గాయపడగా.. మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. కృష్ణను 108లో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. జరిగిన ప్రమాదంపై టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్ట్

మునగపాక: వివాహిత ఆత్మహత్యకు కారకులైన ఇద్దరిని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని గంగాదేవిపేటలో కట్నం వేధింపులకు గురై తన కుమార్తె కుమారి ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రాష్ట్ర స్థాయి యోగా క్విజ్ పోటీల్లో ప్రియాంక సత్తా



ప్రథమ బహుమతి పొందిన ప్రియాంక

కోటవురట్ల: యోగాంధ్ర కార్యక్రమంలో మండలానికి చెందిన ఓ బాలిక సత్తా చాటింది. రాష్ట్ర స్థాయి పోటీలో ప్రతిభ చూపి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. కొడవటిపూడికి చెందిన డి.ప్రియాంక రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన యోగా క్విజ్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచింది. మండలానికి రాష్ట్ర స్థాయిలో కీర్తిని తీసుకురావడంతో ప్రియాంకను ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, గ్రామస్తులు అభినందించారు.

ఆప్కాస్ ఉద్యోగులకు 'తల్లికి వందనం' ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోన లక్ష్మణ

అనకాపల్లి: చాలీచాలని వేతనాలతో బతుకులు నెట్టుకొస్తున్న ఏపీ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్స్‌డ్ సర్వీసెస్(ఆప్కాస్) ఉద్యోగులకు తల్లికి వందనంతో పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని జీవీఎంసీ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ శాఖలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని ఒక వైపు ఆందోళన చేస్తుంటే.. మరోవైపు సంక్షేమ పథకాల కోత వేయడం చూస్తుంటే ప్రభుత్వం చెప్పిన మాటా ఒక్కటి, చేసిన పని ఒక్కటిగా ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు వాయి బోయిన శేఖర్, సోమధుల వెంకట లక్ష్మి, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బంగారు రవి, ఎర్రంశెట్టి అప్పలరాజు, సింగంపల్లి అజయ్, శంకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలు స్వయంశక్తితో నడవాలి



ఎన్ఆర్ఎల్ఎం టీమ్ సభ్యుడు రాజీవ్‌కుమార్‌సింగ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: స్వయం సహాయక సంఘాల సభ్యులు స్వశక్తితో పనిచేసి, బ్యాంకులు అందించే రుణ పరపతిని వినియోగించుకుని అధిక రాబడి సాధించాలని జాతీయ జీవనోపాధి మిషన్(ఎన్.ఆర్.ఎల్.ఎం) టీమ్ సభ్యుడు రాజీవ్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. కె.జె.పురం జంక్షన్‌లో గంగాలమ్మతల్లి స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బిక్యూబ్ గార్మెంట్స్(వస్త్రాలు తయారు చేసే షాపు) ను మంగళవారం పరిశీలించి, గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ బిక్యూబ్ గార్మెంట్స్‌కు పి.ఎం.ఇ.జి.పి. ద్వారా ఆదనపు ఆదాయం పెంపొందించడం గురించి రూ.5.50 లక్షలు మంజూరు చేశారు. సంఘంలో గ్రూపుల పుస్తకాలు పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో నేరుగా మాట్లాడారు. యూనిట్‌ను నిర్వహిస్తున్న కాళ్ల రాజేశ్వరిని అభినందించారు. యూనిట్ వల్ల వచ్చే ఆదాయం గురించి ఆమెతో మాట్లాడారు. సెర్ప్ ఆడిషనల్ డైరక్టర్ కె.సరళతో పాటు డాక్టర్ ఆర్. విజయకుమార్, డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీమతి డైజి, మండల ఏపీఎంవో రమణికుమారి, సర్పంచ్ జామి రమణ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగ్నేసమ్మ ఇకలేరు

హీరో సందీప్ కిషన్ నానమ్మ కన్నుమూత



శవపేటికను మోస్తున్న హీరో సందీప్ కిషన్, కుటుంబ సభ్యులు. చిత్రంలో ఛోటా కె.నాయుడు

కంచరపాలెం: జ్ఞానాపురం సిరిల్ వీధికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని శ్రీపాదం ఆగ్నేసమ్మ(88) సోమవారం అర్ధరాత్రి కన్నుమూశారు. మంగళవారం సెయింట్ పీటర్స్ కేథడ్రల్ చర్చి సెమెట్రీలో ఆమె భూస్థాపన నిర్వహించారు. విశాఖలోని పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయినిగా పనిచేసిన ఆగ్నేసమ్మ.. వృత్తిలో ఉన్న సమయంలో ఎంతోమంది పేద పిల్లలను చదివించి, వారి అవసరాలు తీర్చి అండగా నిలిచారు. ఆగ్నేసమ్మ పెద్ద కుమారుడు రవి తనయుడు, ప్రముఖ హీరో సందీప్ కిషన్ మద్రాసులో స్థిరపడినప్పటికీ, జ్ఞానాపురంలో తమ బంధువులతో సంబంధాలను కొనసాగిస్తున్నారు. తనకు ఎంతో ఇష్టమైన నానమ్మ(ఆగ్నేసమ్మ) మరణవార్త విని చలించిపోయిన సందీప్ కిషన్..తన మేనమామ, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఛోటా కె.నాయుడు, కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఇక్కడకు చేరుకున్నారు. ఆగ్నేసమ్మ భూ స్థాపన కార్యక్రమంలో పాల్గొని ఆమెకు నివాళులర్పించారు. సెయింట్ పీటర్స్ చర్చి పరిసరాల్లో పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త అరెస్ట్

దేవరాపల్లి: దేవరాపల్లికి చెందిన కొన దేవిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడి పరారీలో ఉన్న ఆమె భర్త రామును పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుడిని చోడవరం కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించిందని స్థానిక ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు తెలిపారు. దేవరాపల్లి రామాలయంకు ఎదురుగా ఉన్న గాలి వీధిలో నివాసం ఉంటున్న కోన రాము, దేవి దంపతుల మధ్య కొంత కాలంగా కలహాలు ఉన్నాయి. ఈ నెల 13న తెల్లవారుజాము 4 గంటల ప్రాంతంలో నిద్రలో ఉన్న దేవిపై ఆమె భర్త రాము కత్తితో దాడి చేయగా ఎడమ చేయి బ్రొటన వేలు తెగిపడింది. ఎడమ కాలు, ఎడమ చేయి, మెడపైన తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి పరారీలో ఉన్న రాము కోసం గాలిస్తుండగా.. గ్రామ సమీపంలో ఉన్నట్లు అందిన సమాచారం మేరకు వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఎస్‌ఐ తెలిపారు.

రిక్షా కార్మికుడి మృతదేహం లభ్యం



మృతుడు చేపల సన్యాసిరావు

యలమంచిలి రూరల్ : ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృత్యువాత పడిన 60 ఏళ్ల రిక్షా కార్మికుడు మృతదేహాన్ని పట్టణ పోలీసులు మంగళవారం రాంనగర్ రైల్వేగేటు సమీపంలో గుర్తించారు. ఇక్కడ పెదపల్లికి వెళ్లే రహదారి పక్కన తుప్పల్లో కుళ్లిపోయిన స్థితిలో వున్న మృతదేహం నుంచి తీవ్రమైన దుర్వాసన రావడంతో స్థానికులు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ ఎస్‌ఐ కె.సావిత్రి సిబ్బందితో అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. విచారణ జరపగా మృతుడు మున్సిపాలిటీ పరిధి మంత్రిపాలెం గ్రామానికి చెందిన రిక్షా కార్మికుడు చేపల సన్యాసిరావు(60)గా గుర్తించారు. అతనికి రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు ఉన్నాయని, ఈ నెల 12వ తేదీ నుంచి తన భర్త కనిపించకపోవడంతో అతని కోసం గాలిస్తున్నట్టు భార్య చేపల లక్ష్మి తెలిపింది. వ్యాధుల కారణంగా గుండెపోటు వచ్చి చనిపోయి ఉండొచ్చని పోలీసులకు తెలిపింది. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ విలేకరులకు తెలిపారు.

కుక్కల దాడిలో ఐదు మేకల మృతి



మృతి చెందిన మేకలతో బాధిత రైతు

చీడికాడ: మండల కేంద్రం చీడికాడలో ఓ రైతుకు చెందిన ఐదు మేకలు కుక్కల దాడిలో మృతి చెందాయి. ఈ ఘటనలో సుమారు లక్ష రూపాయల మేర ఆస్తి నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన పినబోయిన పాలకు చెందిన మేకలను పశువుల శాలలో పెట్టగా సోమవారం రాత్రి కుక్కలు విచక్షణ రహితంగా కరిచి చంపినట్లు పాల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

బ్లాక్ మార్కెట్‌లో యూరియా విక్రయాలు అరికట్టాలి



ఏఈవో లక్ష్మికి వినతి అందజేస్తున్న ప్రసాద్, పార్టీ నేతలు

మునగపాక : బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు ఎరువుల విక్రయాలు జరగకుండా చూడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం వ్యవసాయ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా చేపట్టి ఏఈవో లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. పలు చోట్ల బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారన్నారు. స్థానిక పీఏసీఎస్‌లో యూరియా బస్తా రూ.272కు విక్రయిస్తున్నారని, బయట కొనుగోలు చేస్తే రూ.330 నుంచి 350 వరకు విక్రయిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించేవారని గుర్తు చేశారు. వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, పార్టీ నేతలు దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ,పిన్నమరాజు రవీంద్రరాజు,దొడ్డి బుజ్జి, శరగడం గోవింద,మళ్ల జోగారావు,బొడ్డేడ సోమరాజు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో జ్వరాల విజృంభణ



జ్వరాలతో బాధ పడుతున్న గిరిజనులు



జ్వర పీడీతులతో మాటాడుతున్న సీపీఎం నాయకులు

రావికమతం: మండలంలోని చీమలపాడు పంచాయతీ గిరిజన గ్రామాలైన రాయపాడు, చలిసింగం గ్రామాల్లో జర్వాలతో గిరిజనులు అల్లాడిపోతున్నారు. రాయపాడులో గేమ్మిల గంగ, సీదిరి నాయుడు, సేదరి చిలుకమ్మ, పాంగి రామారావు, గేమ్మిల అనిత, చిక్కుడు అంజిలితో పాటు, అజయ్‌పురంలో పాంగి విజయ్‌కుమార్ సహా మరో ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నారు. వీరందరూ జర్వంతో పాటు నరాల నొప్పులతో సతమతమవుతున్నారు. ప్రస్తుతం కొత్తకోటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యం కోసం ఒక్కో వ్యక్తి కనీసం రూ.3 వేలు నుంచి రూ.5 వేలు వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక్కడ గత నెలలో ప్రభుత్వ వైద్యాధికారులు వైద్య శిబిరం నిర్వహించారు. అయినా జ్వరాల తీవ్రత తగ్గలేదు. జీడితోటలో వచ్చిన ఫలసాయం మందులకే ఖర్చు చేయాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండ శిఖర పీవీటీజీ గ్రామాల్లో ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ ఇద్దరు, ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్నారు. చలిసింగం కొండ శిఖర గ్రామంలోనూ ఇటీవల వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరాలు తగ్గుముఖం పట్టినా కీళ్ల నొప్పులు మాత్రం తగ్గడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మరో వైపు రోడ్డు సౌకర్యం లేక వైద్యానికి ఆదివాసీలు నరకం చూస్తున్నారు. గిరిజన గ్రామాల్లో తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, వైద్యులు రాత్రి బస చేసి జ్వరాలు అదుపు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, సంఘం నాయకులు పాంగి భాస్కరరావు, సీహెచ్.శంకర్రావు ఈ సందర్భంగా కోరారు.

ఇజ్రాయిల్ దాడులు అమానవీయం



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరావు

అనకాపల్లి: పాలస్తీనా భూభాగంలో యూదుల వలసలు పెరగడంతో అరబ్బులతో అంతర్గత వర్గ సంఘర్షణ పెరిగిపోయిందని, దీనిపై అగ్రరాజ్యాలు దృష్టి సారించాలని ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో–ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్(ఇస్కఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.మాధవరావు తెలిపారు. ఇస్కఫ్ ఆధ్వర్యంలో స్థానిక వై.విజయకుమార్ హాల్లో మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ 20 నెలలుగా ఇజ్రాయిల్ సైన్యం జరిపిన బాంబు దాడుల్లో 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారన్నారు. ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థ శిబిరాలను లక్ష్యంగా చేసుకుని మారణకాండ కొనసాగుతుందని, ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ న్యాయస్థానం సహా అనేక సంస్థలు యుద్ధం విడనాడాలని గళమెత్తుతున్నా, అమెరికా, మిత్ర దేశాల సహకారంతో నెతన్యాహు ప్రభుత్వం అమానవీయంగా దాడులు కొనసాగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా నాయకులు మళ్ల చక్రవర్తి ప్రొఫెసర్ డాక్టర్ ఎం. నూకరాజు, సభ్యులు దావూద్ ఆలీ, బుద్ధ వీరునాయుడు, బొడ్డేడ అప్పారావు, బొట్టా చిన్నియాదవ్, శేఖరమంత్రి సాయిలక్ష్మణ్, మల్లికార్జున రావు, రామచంద్రరావు, కోన లక్ష్మణ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగంలో ఎత్తు నుంచి జారిపడి కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. కార్మిక నాయకుల సమాచారం మేరకు వివరాలివి.. గాజువాక డిపో సమీప నక్కవానిపాలేనికి చెందిన కె.వి.రమణ (53) కోక్‌ఓవెన్స్ విభాగం సీడీసిపి–3లో స్కిల్డ్ కార్మికుడు పని చేస్తున్నాడు. మంగళవారం యథావిధిగా విధులకు హాజరైన రమణ ట్రాన్స్‌ఫార్మర్ మార్చడానికి సుమారు 50 మీటర్లు ఎత్తులోకి వెళ్లాడు. అక్కడ నిల్చున్న షీటు విరిగిపోవడంతో కింద జారి పడ్డాడు. వెంటనే సహోద్యోగులు కోక్‌ఓవెన్స్ ప్రాథమిక చికిత్సా కేంద్రానికి తీసుకెళ్లారు. అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు ధృవీకరించారు. రమణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరావు

అనకాపల్లి టౌన్‌: చాకచక్యంగా ద్విచక్ర వాహనాలు తస్కరిస్తున్న దొంగను పట్టణ పోలీసులు అరెస్ట్‌ చేశామని పట్టణ క్రైం ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరావు మంగళవారం తెలిపారు. పట్టణ సీఐ టి.వి. విజయ్‌కుమార్‌ పర్యవేక్షణలో తుమ్మపాల ఏలేరు కాలువ వద్ద సోమవారం నిందితుడిని అరెస్ట్‌ చేశామన్నారు. చీడికాడ మండలం, అదే గ్రామానికి చెందిన మాకాల ధనుకుమార్‌ పరవాడ కెమికల్‌ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడన్నారు. ఇతను ఇటీవల వేల్పులవీధి రాఘవేంద్రస్వామి గుడి వద్ద ఇంటి ముందు పార్కు చేసిన గ్లామర్‌ బైక్‌, పూడిమడక రోడ్‌ రామాలయం వద్ద పార్క్‌ చేసిన పల్సర్‌ బైక్‌ను దొంగలించాడని తెలిపారు. నిందితుడు నుంచి పల్సర్‌ బైక్‌ స్వాధీనం చేసుకోని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రంథాలయ సెస్‌పై దృష్టి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజ్‌

కశింకోట: గ్రంథాలయంలో పుస్తకాలు చదవడం కోసం డిపాజిట్‌ సభ్యులను ఎక్కువగా చేర్పించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. కుమార్‌రాజా ఆదేశించారు. మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రంథాలయ అధికారి కె. జగన్నాథంకు పలు సూచనలు చేశారు. పంచాయతీ నుంచి గ్రంథాలయ సెస్‌ రావడం పట్ల దృష్టి సారించాలన్నారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

యోగాంధ్ర శిక్షణ



యోగాంధ్ర శిక్షణలో పారిశుధ్య, సచివాలయ సిబ్బంది

కశింకోట: మండలంలో తాళ్లపాలెం, కశింకోట కల్యాణ మండపాల్లో సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బందికి యోగాంధ్రపై మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు యోగాసనాలు వేయించి అవగాహన కలిగించారు. డిప్యూటీ ఎంపీడీవో ఎం. వెంకటలక్ష్మి, యోగా బోధకులు ప్రభాకర్‌, నూకరాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 107 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,870	4,920
రెండో రకం	3,800	4,220
మూడో రకం	2,860	3,700

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్‌-1	: డ్రాగన్‌
సత్యనారాయణ స్క్రీన్‌-2	:అందాల రాక్షసి
పర్తిసాయి	:ఖలేజా
షిర్డీసాయి	: థగ్‌ లైఫ్‌
వెంకటేశ్వర	:పాప
శ్రీ సత్య	: కట్టప్ప జడ్జిమెంట్‌
రామచంద్ర	: హంటర్‌

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్‌ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్‌ 12 యూనిట్లు, బీ పాజిటివ్‌ -6, ఓ పాజిటివ్‌ -20, ఏబీ పాజిటివ్‌ -5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌ బ్యాంక్‌ టెక్నీషియన్‌ యు. లోకేష్‌ను 9703619706 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్‌ సమాచారం

అనకాపల్లి: ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ ద్వారా మంగళవారం 411 మంది గ్యాస్‌ బుక్‌ చేసుకున్నారు. గతంలో బుక్‌ చేసుకున్న వారిలో 387 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

ఇదేనా స్వచ్ఛాంధ్ర ?

గ్రామాల్లో ఏ వీధి చూసినా ఏమున్నది గర్వ కారణం... చెత్తకుప్పలు, మురుగు కంపు తప్ప అభివృద్ధి జాడ ఏదీ? ఏడాది పాలనలో ఇదేనా స్వచ్ఛాంధ్ర అంటూ సగటు వ్యక్తి పెదవి విరుస్తున్నాడు. గ్రామగ్రామాన పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అధ్వాన డ్రైనేజీ వ్యవస్థతో మురుగు కంపు కొడుతోంది. పర్యవసానంగా ఈగలు, దోమలు స్వైర విహారంతో సీజనల్‌ వ్యాధులు బారినపడుతున్నామని ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌ అంటూ హడావుడి చేస్తున్న సీఎం చంద్రబాబు ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం
- ఏ వీధి చూసినా మురుగు, చెత్తకుప్పలే దర్శనం
- భరించలేని దుర్వాసన, దోమలతో ఇక్కట్లు
- విష జ్వరాల బారిన గ్రామీణులు
- పారిశుధ్య నిర్వహణలో కూటమి పాలకుల నిర్లక్ష్యం



డంపింగ్‌ యార్డును తలపిస్తున్న డివైడర్‌



ఇంటింటికి సర్వే చేస్తున్న ఆశా వర్కర్లు



బురద, మురుగుతో దుర్గంధంగా తుమ్మపాల సంత పరిసరాలు



గవరపేట వీధి రోడ్డు మధ్యలో దర్శనమిస్తున్న చెత్తకుప్ప



బయ్యవరం హైస్కూలు పక్కన పేరుకుపోయిన చెత్త కుప్ప

తుమ్మపాల: పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. ఈ ఏడాది వేసవి మొత్తం వర్షాలతో ముగిసిపోయింది. దీంతో గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ వర్షపు నీరు నిలిచిపోయి మురుగుకూపంగా మారాయి. పారిశుధ్య నిర్వహణపై సరైన చర్యలు తీసుకోవడం లేదు. అడుగడుగునా పాలకుల నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. పల్లెల్లో ఏ వీధి చూసినా చెత్త కుప్పలు, మురుగు పారని డ్రైనేజీలు, దోమలకు ఆవాసంగా పెరిగిన పిచ్చిమొక్కలతో పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వ్యాధులపైనా, పరిసరాల పరిశుభ్రతపైనా అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రయోజనం లేకపోతోంది.

విష జ్వరాల బారిన ప్రజలు

ప్రధానంగా పారిశుధ్య నిర్వాహణ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీటికి మురుగు తోడై కలుషితమై పల్లెలు అపరిశుభ్రంగా మారాయి. దీనికి తోడు పారిశుధ్య కార్మికులు వీధి చివరన చెత్తను పోగేసి వదిలేయడంతో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు వ్యాప్తికి కారణంగా మారాయి. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌ వంటి విషజ్వరాలు ప్రతి ఒక్కరిని పీడిస్తున్నాయి. ఒళ్లు నొప్పి ఉందంటే చాలు జ్వరం వచ్చేస్తుందేమోనని ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. జ్వరం అంటే రెండు రోజులు మందులు వాడితే సరిపోతుంది. కానీ నేటి విష జ్వరాలు ఒకటి రెండు రోజుల్లో తగ్గిపోయినా, ఆ తర్వాత మొదలయ్యే సమస్యలను తలచుకుంటుంటే జ్వరం అనే మాటే భయపెడుతుందని బాధితులు వాపోతున్నారు. ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులే కాకుండా మోకాలు నుంచి పాదాల వరకు వాపులతో అడుగు తీసి అడుగు వేయాలంటేనే భయాందోళన చెందుతున్నారు. ఇటీవల జ్వరం తగ్గాక శరీరంపై దద్దుర్లతో కూడిన ఎర్రటి మొటిమలు రావడంతో మరింత భయాందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా కొంతమందిలో నిసత్తువ ఆవహించి నిలబడలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఈ జ్వరాల్లో ప్లేట్‌లెట్స్‌ పడిపోవడం, చిన్నపిల్లల్లో రక్తంలో ఇన్ఫెక్షన్‌ శాతం అధికంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జ్వర పీడితుల జేబులకు చిల్లు

ఒకప్పుడు జ్వరమొస్తే రెండు మూడు రోజుల్లో నయం అయ్యేది. ఇప్పుడు కోర్సులు వాడితే గాని నయం కాని దుస్థితి ఏర్పడింది. పల్లెల్లో సైతం క్లినిక్‌లు, ఆర్‌ఎంపీలు కోర్సుల పేరుతో పల్లె ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు. తుమ్మపాల, మామిడిపాలెం, కుంచంగి, కూండ్రం, గొలగాం, రేబాక, కొడుపాలెం, ఊడేరు, బవులువాడ, సీతానగరం పలు గ్రామాలు తీవ్ర విషజ్వరాలతో అల్లాడుతున్నాయి. ప్రభుత్వ వైద్యులపై నమ్మకం లేక ప్రైవేటు వైద్యానికి అలవాటు పడటంతో ఫీజు, పరీక్షలు, మందుల పేరుతో రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఆశా, ఏఎన్‌ఎంలు ఇంటింటి సర్వేలు చేసి వివరాలు నమోదు చేసుకుని నివేదికలు పంపించినా అధికారులు మాత్రం చర్యలకు ఉపక్రమించడం లేదు.

చెత్త కుప్పలకు కేరాఫ్ తుమ్మపాల మేజర్‌ పంచాయతీ

అనకాపల్లి టౌన్‌: అనకాపల్లి మండలంలోని 32 పంచాయతీల్లో పారిశుధ్య సమస్య వేధిస్తోంది. ఏ గ్రామం చూసినా రోడ్లపైనే చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్‌ ఆశయాలు ఇక్కడ నెరవేరడం లేదు. ప్రధానంగా మండలంలోని మేజర్‌ పంచాయతీల్లో ఒకటైన తుమ్మపాలలో పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇక్కడ ఏ వీధి చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. పిల్ల కాలువల దగ్గర నుంచి ప్రధాన కాలువల వరకు పూడిక తీయకపోవడంతో వర్షం నీరంతా ఇళ్లలోకి చేరుతోంది. మెయిన్‌రోడ్డు ఆనుకున్న చినబాబు కాలనీ, గరవపేట వీధి, సాయిబాబా గుడిలైన్‌, సంతలైన్‌, జవహర్‌లాల్‌ నెహ్రూ మార్గ్‌, ఎన్టీఆర్‌ మార్గ్‌, తదితర వీధుల్లో మురుగు, చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. కొన్ని వీధుల్లో కాలువలు లేకపోవడం వల్ల మురుగు అంతా రోడ్డుపై పారుతోంది. దీంతో దుర్వాసన వెలువడటంతోపాటు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాంతాల్లో ప్రయాణించే ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుమ్మపాల మెయిన్‌రోడ్డుపై డివైడర్‌ మొత్తం డంపింగ్‌ యార్డును తలపిస్తోంది. అడుగుకో చెత్త కుప్ప దర్శనమిస్తోంది. చిరిగిన పేపర్ల దగ్గర నుంచి ప్లాస్టిక్‌ కవర్లు, కుళ్లిన పండ్లు, కాయగూరల వ్యర్థాలు డివైడర్ల మధ్యలో పడేస్తున్నారు. పంచాయతీలకు లక్షలాది రూపాయలు నిధులు వస్తున్నా అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోతున్నారు. గ్రామంలో పంచాయతీ నాయకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా చెత్త, మురుగు సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు లేక పారిశుధ్య నిర్వహణ చర్యలు శూన్యం

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో అపారిశుధ్యం రాజ్యమేలుతోంది. చెత్త కుప్పలు, రోడ్లపై మురుగు ప్రవాహాలు దర్శనమిస్తున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో దుర్వాసన వెలువడి భరించలేకపోతున్నామని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. అధికంగా దోమలు వృద్ధి చెంది అనారోగ్యాలకు గురికావలసి వస్తోందని వాపోతున్నారు. పారిశుధ్య పనుల నిర్వహణకు పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ఇటువంటి పరిస్థితి నెలకొందని విమర్శలు వినిపిస్తున్నాయి.

- చింతలపాలెంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. మురుగు కాలువలు దెబ్బతినడంతో రోడ్లపై మురుగు పారుతోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలకు ఆవాసంగా మారాయి. దీనివల్ల స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీలో నిధులు లేవని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- బయ్యవరంలో మురుగు కాలువ నుంచి నీరు సరిగ్గా పారడం లేదు. దీని నుంచి వెలువడుతున్న దుర్వాసన భరించలేకపోతున్నామని హౌసింగ్‌ కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. వర్షం వస్తే మురుగు రోడ్లపై పారుతోంది. ఈ విషయమై పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. హైస్కూలు పక్కనే పెద్ద చెత్త కుప్ప పేరుకుపోయి ఉంది. దాని వల్ల వర్షాలతో కుళ్లిపోయి దుర్గంధ వాసన రావడం, దోమలు వృద్ధి చెందడంతో భరించలేకపోతున్నామని అక్కడి ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- నరసింగబిల్లి ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. రక్షిత పథకం ప్రాంతంలో రోడ్డుపై వాడక నీరు వల్ల రాకపోకలు సాగించడానికి సాధారణ రోజుల్లో సైతం ఇబ్బంది పడుతున్నారు. ఇక వర్షం పడితే మరింత ఇక్కట్లు తప్పడం లేదని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోతోందని స్థానికులు వాపోతున్నారు.
- కశింకోటలోని వివేకానంద స్కూలు వీధిలో పందులు సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వాపోతున్నారు. వీటిని నివారించాలని కోరుతున్నారు. గ్రామంలో ట్రాక్టర్లతో సేకరించిన చెత్తను తీసుకెళ్లి శారదానదిలో పోస్తున్నారు. అది పెద్ద కుప్పగా పేరుకుపోయి అధ్వానంగా తయారైంది. దాన్ని దూరంగా వేరే ప్రాంతానికి తొలగించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.
- తాళ్లపాలెం హైస్కూలు ప్రాంతం తదితర చోట్ల పారిశుధ్యాన్ని మెరుగుపర్చాల్సి ఉంది. వర్షం వస్తే హైస్కూలు రోడ్డులో జాతీయ రహదారిపై నీరు నిలిచిపోవడం వల్ల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అలాగే మండలంలోని ఇతర గ్రామాల్లోనూ పారిశుధ్యాన్ని మెరుగుపర్చడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఖరీఫ్‌ వరి విత్తనాల పంపిణీకి సిద్ధం



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

అనకాపల్లి: రైతులకు ప్రభుత్వం ఖరీఫ్‌ వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వెంకుపాలెంలో మంగళవారం ఆయన రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మండలంలో రైతు సేవా కేంద్రంలో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌జీఎల్‌-2537, బీపీటీ-5204 సాంబమసూరు ఎంటీయూ-1224, 1262 వంటి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు రిజిస్ట్రేషన్‌ చేసుకుని, ఎరువులు, పురుగు మందులు వంటివి రైతు సేవా కేంద్రంలో పొందాలన్నారు. అనంతరం వెంకుపాలెం, సీతానగరం, కుంచంగి గ్రామాల్లో ఎదురుగెడ్డలో తుప్పలు, మట్టి, కూరుకుపోయి ఉన్నాయని, వీటిని వర్షాలు ప్రారంభంకాకముందే తొలగించి సకాలంలో సాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎస్‌.రామారావు, మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి, వెంకుపాలెం సర్పంచ్‌ రాపేటి నాగేశ్వరరావు, తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం కాలువ పనులు పునః ప్రారంభం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి వద్ద పోలవరం కాలువ పనులు నిర్వహిస్తున్నారు. గతంలో మధ్యలో ఆగిపోయిన ఈ పనులను పునః ప్రారంభించారు. దీనిలో భాగంగా మట్టి పనులను పొక్లెయిన్‌తో చేస్తున్నారు. వంతెనల నిర్మాణ ప్రాంతం, ఇతర ప్రాంతాల్లో రాకపోకల అవసరాల కోసం తవ్వకుండా ఉంచిన దిబ్బలను తవ్వి కాలువకు అడ్డంకి లేకుండా రూపు తీసుకొచ్చే పనులు చేస్తున్నారు. అక్కడి వంతెనపై నుంచి నడిచి వెళ్లే విధంగా రెండు వైపులా కంకర మట్టి వేసి అప్రోచ్‌లను కలుపుతున్నారు. కాలువలో తవ్విన మట్టిని టిప్పర్లలో పక్కకు తరలించి బుల్‌డోజర్‌తో చదును చేసి రక్షణ గట్టును ఏర్పాటు చేస్తున్నారు. గొబ్బూరు వద్ద కాలనీకి వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణం చేపట్టి నిర్వహిస్తున్నారు. గతంలో కాలువ తవ్వి సిమెంట్‌ కాంక్రీట్‌తో లైనింగ్‌ ఏర్పాటు చేశారు. దానిలో వర్షపు నీరు నిల్వ ఉండి కళకళలాడుతోంది. నూతలగుంటపాలెం కాలువలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో అక్కడ మట్టి పనులు నిర్వహించడానికి అవరోధం ఏర్పడిందని సమాచారం.



నరసింగబిల్లి వద్ద పొక్లెయిన్‌తో పోలవరం కాలువ తవ్వకం పనులు

‘నిరాశ్రయ ఆదరణ ఆశ్రమం’ ఏర్పాటుకు డిమాండ్‌



ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి: సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు ‘నిరాశ్రయ ఆదరణ ఆశ్రమం’ (ఆర్ఫాన్స్‌ షెల్టర్‌ హోమ్‌)ను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సిద్ధార్థ సోషల్‌ సర్వీస్‌ అండ్‌ కల్చరల్‌ అసోసియేషన్‌ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం డిమాండ్‌ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిరాశ్రయ ఆదరణ ఆశ్రమం ఏర్పాటు చేయాలని మంగళవారం ఫ్లకార్డులతో ధర్నా చేశారు. కార్యాలయ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. నాగభూషణం మాట్లాడుతూ జిల్లా కేంద్రం ఏర్పడి నాలుగు సంవత్సరాలు కావస్తున్న నిరాశ్రయ ఆదరణ ఆశ్రమం ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు. పట్టణ పరిధిలో 200 మంది నిరాశ్రయులు రహదారులపై ఉన్నారని వాపోయారు. కొంతమంది మతిస్థిమిత్తం లేనివారు, యాచకులు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ సభ్యులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణ మోహన్‌, రొబ్బి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయాలి

మునగపాక: రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్‌ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రెండో విడత కింద కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.1121 కోట్లను ఐదు నెలల కిందట రాష్ట్రానికి విడుదల చేసిందన్నారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు అందజేసి ఆదుకోవాలన్నారు. పంచాయతీల వాటాను ఇవ్వకపోవడంతో పారిశుధ్యం, తాగునీటి సరఫరా నిలిచిపోతున్నాయని వాపోయారు.

దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణం రేపు



పెండ్లిరాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం శతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయ అష్టమి వార్షికోత్సవం సందర్భంగా ఆలయ శాశ్వత చైర్మన్‌ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు బోగారపు వెంకటరమణ, ఉదయగిరి చంద్రశేఖర్‌ మంగళవారం అమ్మవారి పెండ్లిరాట వేశారు. ఈ నెల 18న అమ్మవారి ఆలయంలో హోమం, గోపూజ, 19న దుర్గామల్లేశ్వర స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు కాండ్రేగుల నాయుడు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పొలమరశెట్టి వెంకట అప్పారావు వాణి, బుద్ధ సంతోష్‌ హేమలత, పొలిమేర శ్రీనివాసరావు జయ దంపతులు పెండ్లిరాట పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.వి. రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌ భీమరశెట్టి వరాహ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

అచ్యుతాపురం రూరల్‌ : ఎర్రవరం గ్రామంలో కోడి పందేల స్థావరంపై దాడి చేసినట్లు అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్‌ తెలిపారు. ఎర్రవరం గ్రామ శివార కొండ ప్రాంతంలో కోడి పందేలు ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2 కోళ్లు, రూ.420 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఎటువంటి పందేలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వసతి గృహం ఏర్పాటు చేయాలని వినతి



జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యవర్గం

అనకాపల్లి టౌన్‌: పట్టణంలో 2వ బీసీ మహిళా వసతి గృహం ఏర్పాటు చేయాలని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి జి. ఫణీంద్ర కుమార్‌ కోరారు. ఈ మేరకు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంలో మహిళలకు బీసీ మహిళా వసతి గృహం ఒకటే ఉండడం వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులు చదువుకోవడానికి ఇక్కడ అవకాశం లేకుండా పోతుందన్నారు. తక్షణమే జిల్లా కేంద్రంలో రెండో వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు బి. బాజ్జీ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వారికి సరైన వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్‌ పాల్గొన్నారు.

విత్తన శుద్ధి చేసుకుంటే మేలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్‌ ఏడీఆర్‌ డాక్టర్‌ జగన్నాథరావు

అనకాపల్లి: రైతులు వరి నారుమళ్ల తయారు చేసుకుని 2 కిలోల యూరియా, 6 కిలోల సింగిల్‌ సూపర్‌ ఫాస్ఫేట్‌, కిలో మ్యురేట్‌ ఆఫ్‌ పొటాష్‌ను వేసుకుని ఎకరాకు 20 కిలోల చొప్పున విత్తనం వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జి ఏడీఆర్‌ డాక్టర్‌ పి.వి.కె.జగన్నాథరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్‌ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెద వరి విత్తే రైతులు ఎంటీయూ-1262, 1318, 1224 వంటి వరి రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బెండజింతో విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలన్నారు. ఖరీఫ్‌లో మొక్కజొన్నలో అధిక దిగుబడినిచ్చే డీహెచ్‌ఎం-117, 119, 121 వంటి రకాలను ఎకరాకు 8 కిలోలు చొప్పున 60 ఇంటూ 20 సెం.మీ. దూరంలో విత్తుకోవాలన్నారు. మొక్కజొన్నను విత్తేముందు సయాంట్రనిలిప్రో-థయోమిధాక్సామ్‌ 6 మి.లీ కిలో విత్తనం చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసినట్లయితే కత్తెర పురుగు ఉధృతిని కొంత వరకు తగ్గించవచ్చనని సూచించారు. 20 నుంచి 25 రోజుల వయసు గల నువ్వు పంటలో ఎకరానికి 22 కిలోల యూరియా పైపాటుగా వేసుకోవాలన్నారు. నువ్వు పైరులో ఆకుముడత ఆశించే అవకాశం ఉన్నందున్న ఇమిడాక్లోప్రిడ్‌ 0.25 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించవచ్చునన్నారు. 120 రోజుల వయసు గల చెరకు పైరులో మొక్కల వరుసల మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలని, పంట ఎదుగుదలను బట్టి మొవ్వులో 8 ఆకులు వదిలి జడచుట్టు వేసుకుంటే గాలులకు తోట పడిపోకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, ఆర్‌.సరిత, ఎ.శిరీష, వి.చంద్రశేఖర్‌, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులేఖర్లు, స్టాంప్‌వెండర్ల ఆందోళన



చోడవరం సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖర్లు, స్టాంప్‌వెండర్లు

చోడవరం : పేపర్‌లెస్‌ డాక్యుమెంట్‌ విధానం వద్దంటూ దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు ఆందోళనకు దిగారు. చోడవరం సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం వద్ద వీరంతా మంగళవారం నిరసన తెలిపారు. రిజిస్ట్రేషన్‌ ప్రక్రియలో ప్రభుత్వం కొత్త విధానాలను యోచిస్తుండడంతో దీనిపై దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు వ్యతిరేకించారు. పేపర్‌లెస్‌ డాక్యుమెంట్‌ విధానం పెడితే అనేక అవకతవకలు జరిగి ప్రజలకు చాలా నష్టం, ఇబ్బందులు కలుగుతాయని అన్నారు. ప్రజల ఆస్తులకు భద్రతపోతుందని, ఈ విధానాన్ని రద్దుచేసి డాక్యుమెంట్‌ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్‌ చేశారు. అనంతరం సబ్‌ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇచ్చారు.ఆందోళనలో వడ్డాది రమేష్‌, కె.నారాయణరావు, బొబ్బిలి శేఖర్‌ పాల్గొన్నారు.